


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

నిజామాబాద్ కామారెడ్డి

శనివారం 29 మార్చి 2025 4 పేజీలు




# మంత్రివర్గ విస్తరణలో చోటు ఎవరికో....

- అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఆశావాహులు
- నిజామాబాద్ నుండి మంత్రివర్గంలో లేని ప్రాతినిధ్యం
- రేసులో సుదర్శన్ రెడ్డి,షబ్బీర్ అలీ,మదన్ మోహన్ రావు







**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

మంత్రివర్గ విస్తరణకు అధిష్టాన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావాహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మంత్రి పదవి దక్కించుకునేందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 15 నెలలు గడుస్తున్నా నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో పరిపాలనపై పట్టు ఆశించిన మేర కనిపించడం లేదు.ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాటిని క్షేత్రస్థాయిలో ప్రతిభావంతంగా అమలు చేయడం లేదన విమర్శలు ఉన్నాయి. జిల్లాకు మంత్రి లేకపోవడం కూడా అధికారులపై ఆజమాయిషీ కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.రాష్ట్ర నూతన మంత్రివర్గంలో చోటు కోసం ప్రభుత్వ సలహాదారుడు, మైనారిటీ ముఖ్యనేత షబ్బీర్ ఆలీ తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.మంత్రివర్గంలో మైనారిటీ నుండి ఎవరు కూడా ప్రాతినిధ్యం వహించడం లేదు.ముఖ్యమంత్రికి సన్నిహితునిగా పేరు ఉన్నా షబ్బీర్ అలీ మంత్రిగా అవకాశం వస్తుందని ఆయన అభిమానులు అనుచరులు ఆశావహం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు బోధన్ ఎమ్మెల్యే,సీనియర్ నాయకులు ఆయన సుదర్శన్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు ఖాయమనే ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు.గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండడం,రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిగా ఉండడం ముఖ్యమంత్రి కూడా సుదర్శన్ రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నారని... చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి నమ్మిన బంటు లాగా పార్టీని పట్టుకుని ఉండడం అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితులుగా పేరు ఉండడంతో కూడా నూతన మంత్రివర్గంపై ఆశలు పెట్టుకున్నారు. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు రాష్ట్రంలో చాలామంది ఉన్నా ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన మదన్ మోహన్ రావు పార్టీ పెద్దలు సైతం తనకు అనుకులంగా ఉంటారనే ఆశతో మంత్రి వర్గంలో చోటు కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.తొలిసారి జరిగిన మంత్రివర్గంలోనే మదన్ మోహన్ రావుకు మంత్రిగా అవకాశం వస్తుందని చాలా మంది అనుకున్నారు. ఐటీ కంపెనీలు ఉండడంతో ఆయనకు మంత్రి పదవి ఇచ్చి ఐటీ వ్యవహారాల శాఖ కేటాయిస్తారని వారి అనుచరులు అనుకున్నారు.కానీ ఆయనకు నిరాశే మిగిలింది. ఈ సారి జరిగే మంత్రి వర్గ విస్తరణలో తప్పకుండా అవకాశం వస్తుందని ఆయన అభిమానులు అనుచరులు ఆశావహం వ్యక్తం చేస్తున్నారు.ఏది ఏమైనా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండి రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహించేది ఎవరనేది ముందు ముందు తెలుస్తుంది.

# ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య కామారెడ్డి ప్రతినిధి**

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలం సంతాయిపేట గ్రామంలోని శ్రీ భీమేశ్వరాలయం సమీపంలోని చెక్ డ్యాం లోని పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ఉపాధి హామీ పథకం క్రింద కూలీలకు పనులు కల్పించాలని అన్నారు. గ్రామంలో 240 హౌస్ హెూల్డ్స్ కి గాను 316 జాబ్ కార్డ్స్ ఉన్నాయనీ, 280 యాక్టివ్ కూలీలు పనులకు హాజరవుతున్నారని తెలిపారు. దాదాపు ఒక వారం నుండి చేపడుతున్న పూడికతీత పనుల్లో కూలీలకు కూలీ చెల్లించడం లేదని, పోస్టాఫీస్ ద్వారా చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని కూలీలు కలెక్టర్ కు వివరించారు. పోస్టల్ శాఖ ద్వారా కాకుండా బ్యాంకు ఖాతాల ద్వారా కూలీ చెల్లించే విధంగా ఏర్పాట్ (మిగతా 2లో)



## సిద్ధాపూర్ రిజర్వాయర్

# పనులను వేగవంతం చేయాలి

- ప్రభుత్వ సలహాదారు పోచారం, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష



**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల ప్రగతిపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, ల్యాండ్ అండ్ సర్వే తదితర శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు పోచారం, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సమీక్ష జరిపారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ డీ.ఎఫ్.ఓ వికాస్ మీనా, కామారెడ్డి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న పనుల స్థితి గతుల గురించి అధికారులు పోచారం దృష్టికి తెచ్చారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ఎలాంటి సాగునీటి వసతి లేని తండాలు, అనేక గ్రామాలకు ఈ రిజర్వాయర్ వరప్రదాయినిగా నిలువనుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అంకిత భావంతో కృషి చేయాలని అధికారులకు హితవు పలికారు. అటవీ భూముల సేకరణ ఇబ్బందికరంగా ఉన్న చోట ప్రత్యామ్నాయ మార్గాలను అవలంభిస్తూ పనులకు ఆటంకాలు ఏర్పడకుండా ముందుకెళ్లాలని సూచించారు. అవసరమైతే నిర్ణీత రిజర్వాయర్ నిర్మాణ ప్రణాళికలో స్వల్ప మార్పులతోనైనా పనులను చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చొరవ చూపాలన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం ఆవశ్యకత గురించి ప్రభుత్వానికి సైతం వివరించగా, అన్ని విధాలుగా తోడ్పాటును అందజేస్తుందని అన్నారు. సరిపడా నిధులు అందుబాటులో ఉన్నందున పనులలో (మిగతా 2లో)

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన
# వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్

**సూర్య, బీర్కూర్**



మండల కేంద్రంలోని పలు సొసైటీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి ప్రారంభించారు. పోచారం మాట్లాడుతూ నియోజకవర్గంలో యాసంగి వరి ధాన్యం కోతలు అన్ని జిల్లాలతో పోలిస్తే ముందస్తుగా ప్రారంభమయ్యా యని అందుకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవద్దని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకున్నామని తెలిపారు.రైతులకు ఎటువంటి నష్టం జరగకూడదు అని రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న సన్నం రకం దాన్యాన్నికి ప్రోత్సహకంగా క్వింటాలుకు 500/- బోనస్ ఇవ్వడం జరుగుతుంది. కావున రైతులు సద్వినియోగ పరచుకోవాలని తెలియచేసారు.ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 2320/- రూపాయలకు,కామన్ గ్రేడ్ 2300/- రూపాయలకు కొనుగోలు చేస్తుందని, రైతులు శుభ్రం చేసి పొల్లు లేకుండా,తేమ 17% లోపు ఉండేల కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలియ జేసారు. ఈ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల,వైస్ చైర్మన్ యామ రాములు సొసైటీ చైర్మన్ రాధాకృష్ణ,మాజీ ఎంపీపీ రఘు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు సందీప్, శశికాంత్, సొసైటీ కార్యదర్శి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నగరంలో సీపీ ఆకస్మిక తనిఖీలు

**సూర్య మోపాల్**




నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గురువారం అర్ధ రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. నగరంలోని ఒకటి, రెండో టౌన్, పోలీస్ స్టేషన్ల పరిధి లోని కాలనీ ల్లో పర్యటించారు. షబ్ ఏ ఖాదర్ సందర్భంగా జామ మజీద్, బర్కతు పుర, మాల పల్లి, ఆటోనగర్, గురుద్వారా, తదితర ప్రాంతాల్లో స్థానికులతో కలిసి తిరిగారు. శాంతి భద్రతలకు విఘాతం కలగ కుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

## క్రాప్ లోన్ ఏడాదిలోపు రెన్యువల్ చేసుకుంటే..
## కేంద్ర ప్రభుత్వం మూడు శాతం రాయితీ ఇస్తుంది..

**- చైర్మన్ శైలేష్ కుమార్..**

**సూర్య-నవీపేట్**



క్రాప్ లోన్ లను రైతులందరూ ఏడాదిలోపు రెన్యువల్ చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మూడు శాతం రాయితీ వర్తిస్తుందని నాగేపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు శైలేష్ కుమార్ అన్నారు. నాగేపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో 63 వ మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 846 మంది సభ్యులకు గాను 4 కోట్ల పది లక్షల వరకు రుణమాఫీ జరిగిందని మరొక 310 మందికి రెండు కోట్ల 88 లక్షల వరకు రుణమాఫీ కావలసి ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా చూడాలని కోరారు. సొసైటీ పరిధిలో కొత్తగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా రైతు స్వామి దాస్ కోరగా ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. సొసైటీ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణానికి నైట్ వాచ్ మెన్ నియమించేందుకు తీర్మానించారు. గోదాంకు మరమ్మత్తులు మరియు 10 ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని తీర్మానించారు. సెప్టెంబర్ 1 2024 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు జమ ఖర్చులను సీఈవో రమేష్ మహాజన సభ ముందు సమర్పించగా పాలకవర్గం ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ సత్యం రెడ్డి, డైరెక్టర్లు ధర్మాజీ, సాయిలు, శ్రీనివాసరావు, సాయన్న మరియు రైతులు సహకార సంఘం సిబ్బంది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గోవులను ఎత్తుకెళ్లిన దొంగలు..

**సూర్య- నవీపేట్**

మండల కేంద్రంలో 4 ఆవుల గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు యజమాని గొర్ల మహేందర్ తెలిపారు. మండల కేంద్రంలో నివాసముండే గొర్ల మహేందర్ కుటుంబానికి చెందిన ఆవులు గతంలో 2 గురువారం రాత్రి 2 మొత్తం నాలుగు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని. ఈ ఆవులు మండల కేంద్రంలో గల మార్కెట్లో తిరుగుతుంటాయని. ఈరోజు ఉదయం నుండి కనిపించలేదని యజమాని తెలిపారు.

## చెట్టుకు ఉరేసుకుని యువకుని ఆత్మహత్య.

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఓ పొలం వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని గూల బాల కృష్ణ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి గ్రామానికి చెందిన గుల బాల కృష్ణ (30) అనే యువకుడు ఆరోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు అని తెలిపారు. మృతుని కోసం అతని కుటుంబ సభ్యులు గురువారం రాత్రి వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు అడవి ప్రాంతంలో వెతకగా మృతుడు చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. సంఘటన స్థలంలోనే మృతుని ద్విచక్ర వాహనం ఉంది. ఈ విషయాన్ని కుటుంబీకులు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై శివకుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి కుమారుడు అరవింద్ ( 12), కూతురు భాను(10) ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు చనిపోవడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**-కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి**

**సూర్య, లింగంపేట్**



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శోభారాణి అన్నారు.ఆమె శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్ యుడైస్ ప్లేస్ లో ఉన్న విద్యార్థుల సంఖ్య వెరిఫికేషన్ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ఎదగాలంటే చదువు ఒకటే మార్గం అని విద్యార్థులకు సూచించారు. వంట చేసేటప్పుడు వంట పాత్రలు శుభ్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు.9వ తరగతి ఇంగ్లీష్ క్లాస్ రూమ్ టీచింగ్ అబ్జర్వేషన్ చేశారు.వెనుక పడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు వాసంతికి తెలిపారు .వీరి వెంట సిఆర్పి సత్యనారాయణ,ఉపాధ్యాయులు హేమలత, మీనా,మౌనిక,ఉన్నారు.

## కుళాయిల ద్వారా కలుషితనీరు
## వస్తున్న అధికారులు స్పందించడం లేదు

**సూర్య, బీర్కూర్**



మండల కేంద్రంలో ని ఇందిరా కాలనీలో గత రెండు రోజులుగా మంచినీటి కుళాయిల ద్వారా కలుషిత నీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ గత రెండు రోజులుగా అధికారులకు సమస్యలు విన్నవించిన ఏ ఒక్క అధికారి పట్టించుకోవడంలేదని ఇలాగే సాగితే తీవ్ర అనారోగ్య బారిన పడుతున్నామని వారు తెలిపారు. ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి కుంటుపడుతుందని ఏ అధికారికి మొరపెట్టుకోవాలో తెలియడం లేదని వారు తెలిపారు.

## ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారికి సూచించారు. అనంతరం శ్రీ భీమేశ్వరాలయం లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ దేవాలయం పురాతన కాలం నాటిదని, పర్యాటకంగా అభివృద్ధి పరచాలని పూజారులు, గ్రామస్తులు కలెక్టర్ ను కోరారు. రోడ్డు సౌకర్యం, నీరు, టాయ్ లెట్స్ ఏర్పాటుచేయాలని కోరారు. అనంతరం గ్రామంలోని నర్సరీను పరిశీలించి, ఇంటింటికీ పంపిణీ చేసే విధంగా పండ్లు, పూల మొక్కలను పెంచాలని తెలిపారు. అనంతరం పల్లె ప్రకృతి వనంలో కలెక్టర్ మొక్కలకు నీరు పోశారు. ప్రతీ రోజు మొక్కలకు నీరు పోయాలని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా గ్రామస్తులు ప్రమీల ఇంటికి భూమి పూజ చేసి, నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఆ తరువాత బ్రహ్మాజీవాడ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలకు వాటరింగ్ నిర్వహించారు. ఏవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించాలని, గాప్ లలో కొత్త మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఇన్చార్జి తహసీల్దార్ రేఖ, ఎంపీడీఓ సాజిద్, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, ఇతర మండల అధికారులు, పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్
# పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకం కోసం డెలివరీ చాంబర్ల నిర్మాణానికి అవసరమైన కొద్దిపాటి స్థలాన్ని ఇరిగేషన్ అధికారులకు కేటాయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల విషయంలో క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ పథకం ప్రాధాన్యతను గుర్తిస్తూ, ఇప్పటికే సుమారు 280 పైచిలుకు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. ఇంకనూ అక్కడక్కడా స్వల్ప మొత్తంలో అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి వీలుగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని, పనులలో వేగాన్ని పెంచి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. వివిధ ప్రాంతాలలో ఏక కాలంలో కొనసాగుతున్న పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, నాణ్యతతో పనులు జరిగేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎఫ్.డీ.ఓ భవానీ శంకర్, ఆయా మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంఠెశ్వర్ బైపాస్ రోడ్డులో మహిళ దారుణ హత్య

**సూర్య మోపాల్**



నిజామాబాద్ నగర శివారు లోని బైపాస్ రోడ్డులో ఒక మహిళ దారుణ హత్యకు గురైంది. కమల (50)అనే మహిళ హత్య చేసి కాలువలో పారిసేందుకువెళ్లగా పోలీసులకు దొరికారు. కమల అనే మహిళను హత్య చేసి డెడ్ బాడీను మాక్లూర్ మండల్ దాస్ నగర్ శివారులోని నిజం సాగర్ కెనాల్లో పడేసేందుకు రాగాపోలీసులు గుర్తించారు. నగరంలోని డీమర్ట్ వెనక మహిళను హత్య చేసిన తర్వాత శవాన్ని కారులో ఎక్కించుకొని తీసుకెళ్లి వేరే దగ్గర పాడేస్తామని చూసారు. ముబారక్ నగర్ దెగ్గర పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.. పోలీసులను చూసి కారు ఆపకుండా వేగంగా వెళ్లడంతో వెంబడించి, కాలువలో పడేస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు.హత్య కు గల కారణాలు తెలియలేదు, పోలీసులు విచారిస్తున్నారు.

## బాల్కొండ జామా మసీద్‌లో
## రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు

**సూర్య బాల్కొండ**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో బాల్కొండ మండల కేంద్రంలో శుక్రవారం జామా మసీద్ పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ సొసైటీ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సహోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సమరస్యానికి ప్రతీక అని, అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనుషులంతా సోదర భావంతో కలసి మెలసి ఉండాలని మనలా మోహన్ రెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డి,బాల్కొండ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్,యూనుస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పోచారం భాస్కర్ రెడ్డి

**సూర్య-బాన్సువాడ**

బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలోని సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజి డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన సొసైటీ ఉపాధ్యక్షులు అంబర్ సింగ్ చిత్రపటానికి పాలకవర్గ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా వారు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాలుకు 500బోనస్ ఇవ్వడం జరుగుతుందని, ఏ గ్రేడ్ ధాన్యానికి 2320రుపాయలు, కామన్ గ్రేడ్ ధాన్యానికి 2300 రూపాయలకు కొనుగోలు చేస్తుందన్నారు.రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట్ మాజీ సర్పంచ్ శ్రావణ్,నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సూర్య గ్రహణం కనిపించదు

**సూర్య మోర్తాడ్**

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో నేడు సూర్య గ్రహణం ఉన్నప్పటికిని భారతదేశంలో ఎక్కడ కనిపించదని, ఎలాంటి నియమాలు పాటించాల్సిన అవసరం లేదని, పండితులు స్పష్టం చేస్తున్నారు. అమావాస్య గ్రహణము వస్తున్న నేపథ్యంలో చాలామంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో దీని విషయమై వేద పండితులు స్పష్టత ఇచ్చారు. కొత్త ఏడాదిలో మొదటి సూర్యగ్రహణం ఈ నెల 29న ఏర్పడనుందని, అయితే ఈ సూర్యగ్రహణం ఏయే ప్రాంతాల్లో కనిపిస్తుందో వారు తెలిపారు.ఈ సూర్యగ్రహణం మార్చి 29న భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:20 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6:16 గంటలకు ముగుస్తుందని అన్నారు.ఇది పాల్గుణ మాసం కృష్ణపక్ష అమావాస్య రోజున సంభవించే పాక్షిక సూర్యగ్రహణం మాత్రమేనని తెలిపారు. అయితే ఈ సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదు కాబట్టి ఎలాంటి జాగ్రత్తలు, పరిహారాలు పాటించాల్సిన అవసరం లేదని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. అనవసరమైన భయాందోళనలు గురి కావడం కానీ, అపోహలు, వదంతులు నమ్మవద్దని వారు సూచిస్తున్నారు. ఏది ఏమైనా 29వ తేదీ శనివారం,అమావాస్య కలిసి వచ్చిన రోజు కాబట్టి ఈ రోజు శివారాధన చేయడం, శనిదేవుని తైలాభిషేకాలు చేయించుకోవడం, బ్రాహ్మణులకు నువ్వులు దానం చేయడం వంటివి చేయడం వలన గ్రహదోషాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. అంతేకాదు అమావాస్య రోజు చేసే అన్నదానంతో పితృదేవతలు ప్రీతి చెందుతారని శాస్త్రం చెబుతోందని వారంటున్నారు. కాబట్టి గ్రహణం విషయంలో ఎలాంటి సందేహాలు, అపోహలు పెట్టుకోకుండా, వదంతులు నమ్మకుండా నిత్య పూజలు, దైవారాధనతో ప్రశాంతంగా వుండాలని వేద పండితులు సూచిస్తున్నారు.

## ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన

**సూర్య - కామారెడ్డి టౌన్**



భారతీయ జనతాపార్టీ కామారెడ్డి పట్టణ శాఖ ఆద్వర్యంలో ఒకే దేశం ఒకే ఎన్నిక పై బీజేపీ దృష్టి కోణం అంశంపై బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ అధ్యక్షతన వర్క్ షాప్ KVS గార్డెన్స్‌లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలపై ప్రజలకు ఏలాంటి అపోహలు అవసరం లేదని నరేంద్ర మోది నాయకత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ పని చేసినా అది భారత దేశ అభ్యున్నతికి సహకరిం చేల ఉంటుందని గత 10 ఏళ్లలో కేంద్రంలోని ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాల ద్వారా భారత్ ను ఆర్థికంగా ఎంతో పురోగతి వైపు తీసుకెళ్లిన విషయం అందరికీ తెలుసని అదే పంథాలో ఒకే దేశం ఒకే ఎన్నిక కావచ్చు, వక్ఫ్ బిల్లు కావచ్చు పార్లమెంట్ స్థానాల పునర్విభజన కావచ్చు ఏది చేసినా అది దేశం మొత్తం ప్రజలకు కుల, మత ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమాన న్యాయం జరిగేలా చూడటమే బీజేపీ సిద్ధాంతం అని అన్నారు. సగం సగం అవగాహనతో కొంత మంది ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజల మధ్యలో ఉంటూ అవగాహన కల్పిస్తూ దొంగ నాటకాలు ఆడే వారికి బుద్ధి చెప్పాలని అన్నారు.

## ఆటోను ఢీకొన్న టిప్పర్

**- ముగ్గురికి గాయాలు**

**సూర్య- నవీపేట్**



పోలీస్ స్టేషన్ పరిధిలో గల పాల్ద గ్రామం వద్ద గురువారం కూలిలను తీసుకొని వెళ్తున్న ఆటోను జన్నెపల్లి నుండి నిజామాబాద్ వైపు వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మీరాజ్ మహమ్మద్ సలీం బైగ్, మొహమ్మద్ అస్లాం, మొహమ్మద్ అన్వర్ అనే ముగ్గురు వ్యక్తులు గాయపడగా వారిని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిరాజ్ కుమారుడు సమీర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు.

## ప్రభుత్వ తరపున ఇఫ్తార్ విందు

**సూర్య మోర్తాడ్**



రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్రమైన నెల, ఇస్లాం యొక్క ఐదు స్తంభాలలో ఉపవాసం ఒకటిగా పరిగణిస్తారు. ఈ నెలలో ముస్లింలు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఆహారం పానీయాలు తీసుకోరు. కనీసం చుక్క మంచినీరు తీసుకోకుండా ఉపవాస దీక్షలు కొనసాగిస్తారు. ఈ పవిత్ర రంజాన్ సందర్భంగా మోర్తాడ్ మండల కేంద్రంలోని జమ మసీదు వద్ద ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఇఫ్తార్ విందు ప్రారంభమైంది. ఈ ఇఫ్తార్ విందులో రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొని ఫ్రూట్స్, చల్లటి పానీయలు తీసుకొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ నెలలో ముస్లింలు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదల కోసం ఖర్చు చేస్తారు. దీనిని జకాత్ అని కూడా అంటారు. రంజాన్ పవిత్ర మాసంలో ముస్లింలు ప్రజలతో మమేకమై ప్రతి ఒక్కరిని కలుసుకునే అవకాశం తో పాటు మంచి సంబంధాలు మెరుగుపరుచుకునే అవకాశాలు ఉంటాయి. ముస్లింలు పవిత్ర ఉపవాసాలు ముగింపు రోజే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ఈ ఉపవాసం ద్వారా ముస్లింలు దైవానికి మరింత దగ్గరవుతారు. పేద ప్రజల కష్టాలను అర్థం చేసుకుంటారు. క్రమశిక్షణ, దాతృత్వం, దార్మిక చింతనలను పెంపొందించుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల రాములు, గిర్మాజీ గోపి, గిర్మాజీ గంగాధర్, వై శ్రీ, నాగభూషణం, గురవయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నవీద్, హంజాద్ పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులను గుర్తించేందుకు ఆయా వార్డులో విచారణ చేపట్టిన రెవెన్యూ సిబ్బంది

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి అర్బన్‌లోని మిగిలిన డబుల్ బెడ్ రూమ్ (41) ఇళ్లకు సంబంధించి అర్హులైన లబ్దిదారులను గుర్తించేందుకు, తహసిల్దార్ ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు,శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆయా వార్డులలో తిరుగుతూ దరఖాస్తుల విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిర్ధవార్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ముందుగా వికలాంగులకు వర్తింపజేయాలి

**సూర్య బోధన్**



సాలూరు మండలం కుమ్మన్‌పల్లి, సాలంపాడు పాతూరు గ్రామలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ లక్ష సంతకాల సేకరణలో భాగంగా నాయకులు కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వికలాంగుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్నికలకు ముందు ప్రతి వికలాంగుడికి నెలకు 6000 పెన్షన్ వృద్ధులకు వితంతులకు 4000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు రాజీవ్ యువశక్తి స్కీంను కూడా వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి, ప్రభుత్వాలు ఇచ్చే ప్రతి స్కీములలో సంక్షేమ పథకాలలో ఐదు శాతం రిజర్వేషన్ ముందు వికలాంగులకు ఇచ్చిన తరువాత సకలాంగులకు ఇవ్వాలని, తదితర సమస్యలన్నీ పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్, జిల్లా అధ్యక్షులు గైని రాములు, జిల్లా కోశాధికారి రామ్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లయ్య బూరే సాయిలు ఉమేష్, రాజు సావిత్రి, లక్ష్మి ధర్మయ్య, గంగారాం పోశెట్టి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తాసిల్దార్ పదవీ విరమణ వేడుక

**సూర్య-బాన్సువాడ**



జుక్కల్ నియోజక వర్గం మద్నూర్ తాసిల్ కార్యాలయంలో డిప్యూటీ ఎమ్మార్వోగా విధులు నిర్వహించి, మండల ప్రజల అభిమానాన్ని చూరగొన్న బీమ్ రావును తాసిల్ కార్యాలయం సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా బీమ్ రావు దంపతులకు శాలువా పూలమాలతో సన్మానించి ఆయన సేవలను కొనియాడారు.విధి నిర్వహణలో నిబద్ధత నిజాయితీతో పని చేశారని ప్రశంసల జల్లులు కురిపించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో ముజీబ్, ఆర్ ఐ.శంకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు పరిశీలించిన ఏపీడి

**సూర్య-నిజాంసాగర్**



మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండిఈద్గా వైపు 20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద కొనసాగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడి హామన్ రావు శుక్రవారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును ఆయన పరిశీలిం చారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేయాలన్నారు. రోడ్డు నిర్మా ణంలో నాణ్యత లోపించకుండా చూడాలని కాంట్రాక్టర్కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీడీవో గంగాధర్, ఏపీవో శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, గాండ్ల రమేష్, రాము రాథోడ్, జమీల్ ఉన్నారు.

## బస్వాపూర్‌లో దొంగల బీభత్సవం

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని బస్వాపూర్‌లో దోపిడి దొంగలు బీభత్సం సృష్టించారు. గురువారం అర్ధరాత్రి దోపిడీ దొంగల ముఠా గ్రామంలో ముందుగా సీసీ కెమెరాలలో కనిపించకుండా వాటికి ఉన్న కనెక్షన్లను కట్ చేసి తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకొని దోపిడీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన 9 మంది ఇండ్లలోకి చొరబడి బంగారు నగలతో పాటు, డబ్బులను, విలువైన వస్తువులను అపహరించుకొని పోయారు. సుమారు 15 లక్షల విలువైన సొత్తు దొంగలు దోచుకెళ్ళినట్లు చెప్పారు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా శుక్రవారం దోపిడీకి గురైన ఇండ్లను ఎస్సై ఆంజనేయులు పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలను ఇతర ఆధారాలను సేకరించారు.

# బాలికలు వేసవి సెలవులలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

## - పోలీసు కళాబృందంతో అవగాహన కల్పించిన ఎస్సై బొజ్జ మహేష్

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో శుక్రవారం జిల్లా పోలీసు అధికారి రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు పోలీసు కళాబృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో భాగంగా ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జా మహేష్ మాట్లాడుతూ వేసవి సెలవులలో ఇంటికి వెళ్ళినప్పుడు అపరిచిత వ్యక్తులతో (గుడ్ టచ్ బాడ్ టచ్) విషయంలో జాగ్రత్తగా ఉండాలని, బాలికలు చెరువులకు ఈతకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోరాదని, వేసవి సెలవుల్లో జరిగే దొంగతనాలను నివారించాలని, అత్యవసర సమయంలో 100 నెంబర్‌కి కాల్ చేయడం మరిచిపోవద్దని, సోషల్ మీడియా నందు జాగ్రత్తగా ఉండాలని విద్యార్ధినిలకు తెలియజేసారు మహిళల కోసం ఎల్ల వేళలా షీ టీమ్ బృందం మీకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. షీటీం నెం.87126 86094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవాలని చెబుతూ, ద్విచక్ర వాహనాలు నడిపే వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, మాదకద్రవ్యాల వినియోగాన్ని అందరూ మానుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయిని, సావిత్రి, ప్రమీల పుష్ప తో షీ టీం సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.








## తాగుడికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**సూర్య- నవీపేట్**



భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నందిగాం గ్రామానికి చెందిన కర్రోల్ల పోశెట్టి (43) మద్యానికి బానిసై బుధవారం రాత్రి రైతుబంధు పైసలతో మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్తను భార్య మందలించడంతో కోపంతో ఇంట్లో నుండి వెళ్లిపోయిన భర్త తిరిగి రాకపోయేసరికి బంధువులు మరియు చుట్టు ప్రక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులో గల కొత్త కుంట చెరువులో మృతదేహం కనిపించగా కుటుంబ సభ్యులు ఆ మృతదేహం కర్రోల్ల పోశెట్టిదేందని గుర్తించారు. మృతుడి భార్య రోజా ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో దేశం అభివృద్ధి

**- బిజెపి మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్**

**సూర్య,లింగంపేట్**



వన్ నేషన్ వన్ ఎలక్షన్ తో ప్రజలు చైతన్యమై దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై అవగాహన కల్పించారు.ఇట్టి కార్యక్రమానికి బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్రావ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు క్రాంతి మాట్లాడుతూ దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం అనేది సరైన నిర్ణయం అని అన్నారు.దేశవ్యాప్తంగా ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతో దేశం అభివృద్ధి చెంది.ప్రజలు మార్పుకు అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షులు మా రాజుల మురళి,బిజెపి ప్రధాన కార్యదర్శి నవీన్,మండల బీజేవైఎం అధ్యక్షులు రజనీకాంత్,మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు అంద్యాల ఉదేశ్,కిసాన్ సాంగ్ మండల చేపూరి పోశెట్టి,లింగంపేట్ పట్టణ అధ్యక్షుడు తిరుమల నరేష్,భూత అధ్యక్షులు విష్ణు,భీమయ్య, గణేష్, రాజారాం సాయిలు,ముకుంద రెడ్డి,భాస్కర్ రెడ్డి,దాసరి సాయిలు,లెగ్గేల రాజు,ప్రసాద్, సంతోష్,బాజ సంతోష్,అనిల్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

**సూర్య,ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డిపట్టణ కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు రెసిడెన్షియల్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.రెసిడెన్షియల్ స్కూల్ లో 216 మంది, బాలికలు ఉన్నత పాఠశాలలో 238 మంది, మోడల్ స్కూల్ లో 250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో యూసఫ్, ఎంఈవో వెంకటేశం పాల్గొన్నారు.

## యువత అభివృద్ధి కోసమే కాంగ్రెస్ సంకల్పం

**సూర్య-కామారెడ్డి**

రాష్ట్రంలో యువతను మెరుగుపరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత పూర్తిగా సద్యోగం చేసుకోవాలని కామారెడ్డి మాజీ కాంగ్రెస్ పార్టీ యూత్ జాయింట్ సెక్రటరీ అజ్జు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందించేందుకు కృషి చేస్తుందని ముఖ్యంగా స్వయం ఉపాధికి అవసరమైన మార్గదర్శకాలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.యువతకు శిక్షణ లోన్ సౌకర్యాలు స్టార్టప్ మద్దతుతో అగ్రగామిగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్ని రంగాల వారు అభినందించాలని సూచించారు. అదేవిధంగా కామారెడ్డి ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ నాయకత్వంలో నియోజకవర్గ యువత అభివృద్ధి చెందేందుకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.ప్రతి యువకుడికి ఉపాధి అవకాశాలు అందేలా ప్రభుత్వ పథకాలను పూర్తిగా అందిపుచ్చుకునేలా అవగాహన కల్పించేందుకు యువ కాంగ్రెస్ శ్రేణులు పనిచేస్తున్నాయని అన్నారు రాజీవ్ యువ వికాసం ద్వారా యువత ఆర్థికంగా స్థిరపడే అవకాశం ఉంది కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా స్వయం ఉపాధిని కూడా లక్ష్యంగా చేసుకొని ముందుకు వెళ్లాలని అజ్జు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో యువతకు అనుకూలంగా అనేక మార్పులు వస్తున్నాయని కొత్తగా ఏర్పాటు అయిన పథకాలను యువత వినియోగించుకుని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**సూర్య బోధన్**



నిజామాబాద్ జిల్లా సాలూరు మండలంలో గల హున్సా గ్రామంలో శుక్రవారం మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్ఆర్ ఇజిఎస్ 5 లక్షల రూపాయలతో హున్సా గ్రావెల్స్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే ఇప్పటి వరకు గ్రావెల్స్ రోడ్డుకు 20 లక్షల వరకు ఇవ్వడం జరిగిందని తమ హున్సా గ్రామం తరపున రైతుల తరపున బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి, మార్కెట్ కమిటి ఇంచార్జ్ చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో ఏఈ లిఖిత, మాజీ సర్పంచ్ చీల గంగారాం, మాజీ సర్పంచ్ చీల మాధవ్. పిఏసిఎస్ చైర్మన్ రవి మందర్న, సొసైటీ వైస్ చైర్మన్ వినోద్ బాబా, బాదే గంగారాం, మాజీ ఎన్‌పిటిసి, గ్రామ అధ్యక్షులు సమ్మె శంకర్ పటేల్, ఈరప్ప మహారాజ్, నరేందర్, సిద్దన్న, ముర్గె మాధవరావు, చెప్రే హనుమంతరావు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న వ్యక్తుల అరెస్ట్

**సూర్య మాక్లూర్**

గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్,మాక్లూర్ ఇంచార్జి ఎస్ఐ లక్ష్మయ్య కథనం ప్రకారం మండలంలోని గుత్ప శివారులో గంజాయి సేవిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు రైడ్ చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు.దీంతో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.గంజాయి ఎక్కడి నుండి సరఫరా అవుతుంది,తదితర విషయాలపై కేసు దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉందని ఎస్ఐ తెలిపారు.

## పండగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**- ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్**

**సూర్య, నాగిరెడ్డి పేట్**



ఉగాది,రంజాన్ పండుగలు ఒకేసారి రావడంతో హిందూ,ముస్లిం సోదరులు పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎల్లారెడ్డి శ్రీ రవీందర్ నాయక్ కోరారు. శుక్రవారం నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్లో హిందూ ,ముస్లిం సోదరులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలో నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయని, ఇదే సమయంలో రంజాన్ పండుగ ఉన్నందున హిందువులు, ముస్లింలు తమ తమ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పండుగ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై మల్లారెడ్డి, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, వివిధ గ్రామాల హిందూ,ముస్లిం యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**సూర్య- బిక్కనూర్**



గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్‌లో 10 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల తరపున షబ్బీర్ అలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్ధిరాములు, మాజీ సర్పంచ్ లంబాడి స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తుడుం జీవన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**- సొసైటీ మాజీ అధ్యక్షుడు రాంచంద్రా రెడ్డి**

**సూర్య, నాగిరెడ్డి పేట్**



మండల కేంద్రంలోని గోపాల్ పేట్ జామా మసీదులో శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకుడు, మాల్తుమ్మెద సొసైటీ మాజీ అధ్యక్షుడు రాంచంద్రా రెడ్డి మండల కేంద్రంలోని మైనారిటీ సోదరులకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా రాంచంద్రా రెడ్డి మండల కేంద్రంలోని ముస్లిం సోదరులకు ప్రతి రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం నాడు ఆయన ముస్లిం సోదరులకు వివిధ రకాల పళ్ళతో ఇఫ్తార్ విందునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెలగాలన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మల్లారెడ్డి, నాయకులు రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సభ్యులు నరసింహారెడ్డి,గ్రామ అధ్యక్షుడు శేఖర్, మండల మైనారిటీ అధ్యక్షుడు ఇమామ్,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గులాం హుస్సేన్, ఏఎంసి డైరెక్టర్ నాగేశ్వర్,మండల యూత్ అధ్యక్షుడు శ్రీరామ్ గౌడ్,నాయకులు,ఫారూఖ్, నారాయణరెడ్డి, సుధాకర్, కుతుబుద్దీన్, గోపాల్‌తదితరులు పాల్గొన్నారు.